క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులు ప్రారంభించనున్న మంత్రి బుగ్గన



మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్, కమిషనర్

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన కొలుములపల్లె రహదారిలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన మార్కెట్ యార్డ్‌ను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ప్రారంభిస్తారని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. అనంతరం రైతులకు భూ పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి పర్యటన ఏర్పాట్లను వారు పరిశీలించారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని చలం రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జస్వంత్‌రెడ్డి, బ్రహ్మనాయుడు, కంట్రాక్టర అజ్మతుల్లా పాల్గొన్నారు.

నేడు ప్యాపిలిలో భూపంపిణీ

ప్యాపిలి: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు బుధవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా భూ పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 గ్రామాలకు చెందిన 292 మంది రైతులకు 410 ఎకరాలు పంపిణీ చేయనున్నామన్నారు. స్థానిక షాదీఖానాలో సాయంత్రం 4 గంటలకు నిర్వహించేకార్యక్రమంలో లబ్ధిదారులకు మంత్రి భూ పట్టాలు అందజేస్తారని చెప్పారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ భారతి

డోన్ టౌన్ : మీ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించాలని, సకల వసతులతోపాటు అధ్యాపకులు పూర్తిస్థాయిలో ఉన్నారని ప్రిన్స్‌పాల్ భారతి తల్లిదండ్రులకు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు వివిధ ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. వారికి కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులతో పాటు సౌకర్యాలను చూపించి వివరించారు.

ఆశయాలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

కొలిమిగుండ్ల: తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. కళాశాల 23వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించేందుకు కృషి చేస్తేనే విద్యార్థులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, బాల ఓబన్న, నాగమల్లేశుడు, రాజా దిలీప్, ఓబయ్య, జాన్సన్ ఆర్నాల్డ్, విజయ్‌భాస్కర్, అనిత కుమారి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శివస్వాములకు భిక్ష



భిక్ష వడ్డిస్తున్న కాటసాని రమాకాంత్‌రెడ్డి

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన వీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వద్ద ఉన్న విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నిత్యాన్నదాన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శివస్వాములకు ట్రస్ట్ చైర్మన్, అవుకు మండలం గుండ్లశింగవరం గ్రామ సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి భిక్ష ఏర్పాటు చేశారు. కాటసాని రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దివంగత కాటసాని శివరామిరెడ్డి జ్ఞాపకార్థం శివస్వాములకు బిక్షను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాగమునిరాజు, వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన కల!

- అంకిరెడ్డి పల్లెకు పీహెచ్‌సీ మంజూరు
- చురుగ్గా సాగుతున్న ఆసుపత్రి భవన నిర్మాణం
- ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఇద్దరు సూపర్ వైజర్లు, ఎంపీహెచ్‌ఓ నియామకం
- ప్రస్తుతం అద్దెభవనంలో ప్రారంభమైన వైద్య సేవలు
- ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామీణులు



మందులు అందిస్తున్న మెడికల్ ఆఫీసర్ నాగార్జున



పీహెచ్‌సీలో ఉన్న మందులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెతోపాటు సమీప పల్లెల కల నెరవేరింది. అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాల సమీపంలో తాత్కాలికంగా ఓ అద్దె భవనంలో డాక్టర్లు పీహెచ్‌సీ సేవలు ప్రారంభించారు. డాక్టర్లు ప్రజలకు పదిరోజుల నుంచి సేవలు అందిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా అంకిరెడ్డిపల్లె గ్రామస్తులు పీహెచ్‌సీ మంజూరు చేయించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పీహెచ్‌సీ మంజూరు చేయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో వెంటనే రూ.2.50 నిధులు మంజూరు అయ్యాయి. ఇటీవల తుమ్మలపెంట క్రాస్ రోడ్డు సమీపంలో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రస్తుతం పనులు పీహెచ్‌సీ భవన నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం ఈపీహెచ్‌సీ కోసం ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, మరో ఇద్దరు సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఓ పోస్టులు మంజూరు చేసింది. దీంతో వారు ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని ప్రజలకు వైద్య సేవలు అందజేస్తున్నారు. మండల కేంద్రం కొలిమిగుండ్ల అయినప్పటికీ అంకిరెడ్డిపల్లె జనాభా, ఓటర్ల పరంగా పెద్ద గ్రామం. నాపరాతి పరిశ్రమపై ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తుంటారు. గనుల్లో పని చేసే సమయంలో కార్మికులు తరచూ ప్రమాదాలు, అనారోగ్యానికి గురవుతూనే ఉంటారు. ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి చొరవ తీసుకొని పీహెచ్‌సీ నూతన భవనం నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ప్రజలకు వైద్య సేవలు అందజేసేందుకు ఓ భవనానికి అద్దె చెల్లించేందుకు ముందుకు వచ్చారు. దీంతో వైద్య సేవలు చేపట్టారు డాక్టర్లు. సాధారణ వ్యాధులు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు చేసి నాణ్యమైన మందులు అందిస్తున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పీహెచ్‌సీలో రోజుకు 60 మంది మేర వైద్య సేవలు పొందుతున్నారన్నారు. పీహెచ్‌సీకి మొత్తం 14 మంది సిబ్బంది ఉంటారని, ప్రస్తుతం ఐదు పోస్టులకు సంబంధించి విధులు నిర్వర్తిస్తున్నామని మెడికల్ ఆఫీసర్ నాగార్జున తెలిపారు. అన్ని రకాల మందులు పుష్కలంగా ఉన్నాయని అంకిరెడ్డిపల్లెతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ సూచించారు.

నేటి నుండి నియోజకవర్గంలో మంత్రి బుగ్గన పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ : ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం నుంచి డోన్ నియోజకవర్గంలో పర్యటిస్తారని, వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంత్రి స్థానిక స్వగృహంలో బుధవారం వారు మాట్లాడుతూ ఉదయం బేతంచెర్ల పట్టణంలో జరిగే ఇళ్లస్థలాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అనంతరం సాయంత్రం 6 గంటలకు ప్యాపిలి పట్టణంలో జరిగే ఇంటి నివేశ స్థలాలను పేదలకు మంత్రి పంపిణీ చేస్తారన్నారు. 23న ఉదయం 9 గంటలకు పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మగాంధీ విగ్రహం, 10 గంటలకు జెడ్పీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను మంత్రి ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో గ్రామ, వార్డు వలంటీర్లను సత్కరించే కార్యక్రమానికి హాజరవుతారన్నారు. తదనంతరం ఓర్వకల్లు చేరుకొని విమానాశ్రయం వద్ద స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను మంత్రి ఆవిష్కరిస్తారన్నారు. ఆయా కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కురుకుందు హరి, నాయకులు మల్యాల భాస్కర్‌రెడ్డి, శీలం భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

చీటింగ్ కేసు నమోదు

బేతంచెర్ల: తన కుమారుడు రాజుకు కోర్టులో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని 2023 ఆగస్టులో రూ. 5 లక్షలు తీసుకొని ప్రభుత్వ వైద్యుడు శ్రీనివాసులు మోసం చేశాడని మండల పరిధిలోని తవిసికొండ గ్రామానికి చెందిన బిచ్చపోగుల మానస పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ బుధవారం తెలిపారు.

ముగిసిన విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో జీర్ణోద్ధరణ గావించిన సోమేశ్వర, శ్రీలక్ష్మి చెన్నకేశవ, గణపతి, శ్రీరామ, లింగమయ్య, నాగసుబ్రహ్మణ్యేశ్వర ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ముగిశాయి. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రాత:కాల పూజలు, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని కొండల్లో వెలసిన శ్రీలక్ష్మి కంబగిరి స్వామి ఆలయ సమీపంలో 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ప్యాపిలి మండలం సీతమ్మతండాకు చెందిన పీక్లానాయక్ ఆలయం సమీపంలో నాటుసారా అమ్ముతుండగా సారాను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

పనులను సద్వినియోగం చేసుకొండి

బేతంచెర్ల: గ్రామాల్లో కల్పించిన ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రవి ప్రసాద్ సూచించారు. బుధవారం కనుమకింది కొట్టాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు రోజుకు రూ. 272 వేతనం పడేలా కొలతలతో పని చేయాలన్నారు. 100 రోజులు పనిచేసిన కుటుంబాలకు అదనంగా 50 రోజులు కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులకు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, ఎఫ్ఏ సుహాసినీ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కోవెలకుంట్ల: స్థానిక మార్కెట్ యార్డు రైతు విశ్రాంతి భవనంలో బుధవారం ఏపీడబ్ల్యూజే కోవెలకుంట్ల మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ మండల అధ్యక్షుడిగా గుర్రప్ప, ఉపాధ్యక్షులుగా మహేశ్వరరెడ్డి, మధుసుదాకర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున ఆచారి, శేఖర్, కోశాధికారిగా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా ఓబులేసు, సురేంద్ర, సయ్యద్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు రాందాసురెడ్డి, వెంకటేశ్వర్లు, భూపాల్‌యాదవ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతే అన్ని అనర్థాలకు మూలం

- మగపిల్లలతో పాటు ఆడపిల్లలను చదివించాలి
- ఐసీడీఎస్ పీడీ నిర్మల



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల

డోన్ : నిరక్షరాస్యతే సమాజంలో అన్ని రుగ్మతలకు మూల కారణమని ఐసీడీఎస్ పీడీ నిర్మల తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం బేటీ బచావో .. బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రాజెక్టు అధికారిని షంషాద్‌బేగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించడం ద్వారానే అనేక రుగ్మతలను రూపుమాపవచ్చన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలతోపాటు మాతా శిశు మరణాలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 18 ఏళ్ల పైబడే వరకు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయరాదని ఆమె తల్లిదండ్రులను సూచించారు. మహిళలు, బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, మెడికల్ అధికారి మాధవిలత, రూరల్ డెవలప్‌మెంట్ అధికారి నాగభూషణం, సీడీపీఓ శారద సూపర్‌వైజర్లు పరమేశ్వరి, పద్మ, శోభారాణి, తిప్పమ్మ, సుగుణ, దేవకృపమ్మ, శకుంతల, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



గోడపై సూచనలు రాస్తున్న వైద్య సిబ్బంది

డోన్ రూరల్ : విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ చెన్నయ్య సూచించారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో విషజ్వరాల నివారణపై బుధవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ ఇంటి చుట్టు ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌లను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువ ఉందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న సర్పంచ్ బాలమద్దిలేటి

కోవెలకుంట్ల: మండలంలోని అమడాలకు జలజీవన్ మిషన్ కింద రూ. 36 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణానికి బుధవారం సర్పంచ్ బాలమద్దిలేటి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులకు శాశ్వత తాగునీటి కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు విడుదలయ్యాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఎంపీటీసీ విజయపాల్, పంచాయతీ కార్యదర్శి అన్వర్, వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకులు శంకరయ్య, వెంకటేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, జగదీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, సంఘం సుధాకర్‌రెడ్డి, మనోహర్, వెంకటసుబ్బయ్య, పెద్ద కంబగిరి, కోట్ల సుధాకర్‌రెడ్డి, మునిస్వామిరెడ్డి, లక్ష్మయ్య, రమణారెడ్డి, విల్సన్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాష దినోత్సవం

డోన్ టౌన్ : అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని స్థానిక పాతపేట హైస్కూల్లో బుధవారం హెచ్‌ఎం వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నెహ్రూనగర్ స్కూల్ హెచ్‌ఎం, తెలుగు కవి డాక్టర్ తొగట సురేష్ బాబు, తెలుగు ఉపాధ్యాయుడు దేవేంద్రప్ప మాతృ భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర తెలుగు వారిదైతే భాష కోసం ప్రాణాలర్పించిన చరిత్ర బంగ్లాదేశ్ ప్రజలదని గుర్తు చేశారు. అనంతరం సురేష్‌బాబును శాలువ, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు రాధ, లీలావతి, ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తెలుగు కవి తొగట సురేష్‌బాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎలక్ట్రికల్ టూ వీలర్ షోరూం ప్రారంభం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని పోలీసు స్టేషన్ సర్కిల్‌లో నూతనంగా ఈజెడ్‌వైజీఓ ఎలక్ట్రికల్ టూ వీల్లర్ షోరూమ్‌ను బుధవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హర్‌మన్‌ప్రీత్ సింగ్ చాహల్‌తో కలిసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు నియోజకవర్గ యువనేత కాటసాని ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలక్ట్రికల్ టూ వీలర్స్ ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అక్కల్-ఈ వరల్డ్ వారి ఆధ్వర్యంలో తయారైన ఈజెడ్‌వైజీఓ టూవీలర్‌ను వాహన ప్రియులు కొనుగోలు చేసి కాలుష్యనియంత్రణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కంపెనీ డీలర్ కాటసాని లక్ష్మీకాంత్‌రెడ్డి, ఉమ్మడి హుస్సేన్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు గోపవరం గోపాల్‌రెడ్డి, ఎస్‌ఎంఈ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎండీతో కలిసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కాటసాని ఓబులరెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి

నేడు బండలాగుడు పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన పాలుట్ల రంగ నాథస్వామి ఆలయం సమీపాన అవధూత కాశిరెడ్డి నాయన 14వ ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 22న న్యూ కేటగిరి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామచంద్రారెడ్డి తెలిపారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 40వేలు, రూ. 30వేలు, రూ. 20వేలు, రూ. 11 వేలు, రూ. 7వేలు, రూ. 5వేల చొప్పున బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రాత్రి పంచమాంకములు నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తులిపారు.

రేపు జాతిపిత, అమరజీవి విగ్రహాల ఆవిష్కరణ

డోన్ : పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంగణంలో ఈనెల 23వ తేదీ శుక్రవారం జాతిపిత మహాత్మగాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గాంధీ విగ్రహాన్ని ప్రతిష్టిస్తారన్నారు. అలాగే స్థానిక జిల్లాపరిషత్ వసతిగృహం ఎదురుగా రోడ్డుపై అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విగ్రహాన్ని కూడా ఇదే రోజు ఆవిష్కరించే అవకాశం ఉందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బనగానపల్లె రూరల్ : విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వలన మానసికంగా ఉల్లాసంగా ఉంటారని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బ్రహ్మానంద ఆచారి అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలోని డీపీఈపీ, ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అంతర్లీన ఆటల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతర్లీన ఆటల పోటీలతో విద్యార్థుల్లో స్నేహ సంబంధాలు ఏర్పడుతాయన్నారు. పోటీల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీపీఈపీ పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం రహీంబేగ్, ఉపాధ్యాయని,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విషాదంలో రాచర్ల పోలీసులు

ప్యాపిలి: రాచర్ల ఎస్ఐ వెంకటరమణ, ఆయన అల్లుడు పవన్ సాయి కుమార్ తెలంగాణ రాష్ట్రం భూత్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం స్థానికంగా విషాదం నెలకొంది. అనంతపురం జిల్లాకు చెందిన వెంకటరమణ రెండేళ్లపాటు నందికొట్కూరులో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. నాలుగు నెలల క్రితం ప్యాపిలి మండలం రాచర్ల పోలీస్‌స్టేషన్‌కి బదిలీపై వచ్చారు. వారం కిందట తన ఏకైక కుమార్తె అనూష వివాహం జరిపించిన ఆయన బుధవారం కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాదుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారి కారు ఓ చెట్టుకు ఢీ కొనడంతో ఎస్ఐ వెంకటరమణ, అల్లుడు పవన్‌సాయి కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాచర్ల పోలీస్‌స్టేషన్ సిబ్బంది తీవ్ర విషాదంలో ఉన్నారు. విధి నిర్వహణలో గర్వం లేకుండా సిబ్బందితో కలసి పని చేసిన ఎస్ఐ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని తోటి సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు.

ఎస్ఐ మృతిపై మంత్రి బుగ్గన దిగ్భ్రాంతి

బేతంచెర్ల: రోడ్డు ప్రమాదంలో ప్యాపిలి మండలం రాచర్ల ఎస్ఐ వెంకటరమణ, ఆయన అల్లుడు మృతి చెందడంపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎస్ఐ వెంకటరమణను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఎస్ఐ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మహబూబ్ నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్ఐ వెంకటరమణ కుమార్తె అనూషకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.